# ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కోసం చోరీ

- ట్రాక్టర్‌తో పాటు కల్టివేటర్‌ను ఎత్తుకెళ్లి విక్రయం
- సీసీ ఫుటేజీల ఆధారంగా గుర్తింపు
- ముగ్గురు యువకులతోపాటు కొన్న వ్యక్తి రిమాండ్
- వివరాలు వెల్లడించిన సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్




పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ రూరల్, జూలై 13 : ఆ ముగ్గురు యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డారు. డబ్బుల కోసం ఏకంగా ట్రాక్టర్‌నే ఎత్తుకెళ్లి అడ్డంగా చిక్కారు. ఆ ముగ్గురు యువకులతో పాటు ట్రాక్టర్ కొన్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలు వెల్లడించారు. బోయినపల్లి మండలం వర్ధవెల్లి గ్రామానికి చెందిన సాయి, వెంకటేశ్, వంశీ ముగ్గురు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో డబ్బుల కోసం రాజన్నపేటకు చెందిన ఈడుగు కనుకయ్య తన పొలంలో దున్నడానికి పెట్టిన ట్రాక్టర్‌ను దొంగిలించి అమ్మాలని ముగ్గురు నిర్ణయించుకున్నారు. రాత్రి సమయంలో ట్రాక్టర్‌తోపాటు కల్టివేటర్‌ను దొంగిలించారు. దీంతో బాధితుడు కనుకయ్య ఈ నెల 2న బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పృథ్వీరార్‌గౌడ్, కానిస్టేబుళ్లు కోటేశ్వర్, తిరుపతితో టీం ఏర్పాటు చేశారు. నిందితులు ట్రాక్టర్‌ను రాజన్నపేట నుంచి నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని మోడెం గ్రామానికి తరలించినట్టు సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించారు. అదే గ్రామానికి చెందిన గంజాయి పోశెట్టికి ₹4.50 లక్షలకు విక్రయించిన విషయాన్ని నిర్ధారించారు. ట్రాక్టర్‌తోపాటు కారు, ద్విచక్రవాహనం, 5 మొబైల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని, ముగ్గురు యువకులతోపాటు కొన్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బాధితులు టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ నిషేధమని, ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దొంగతనం కేసును చేధించిన ఏఎస్పీ, సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.

## పాతదాంరాజ్‌పల్లిలో నక్క!

మల్లాపూర్, జూలై 13: అడవుల్లో సంచరించే నక్క, శనివారం మల్లాపూర్ మండలం పాతదాంరాజ్‌పల్లి శివారులో కనిపించింది. జనవాసాల మధ్యలోకి రావడంతో గ్రామస్తులు పట్టుకునే ప్రయత్నం చేయగా, శివారులోని ఓ బావిలో పడిపోయింది. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ డిప్యూటీ రేంజి అధికారి చంద్రమౌళి, బీట్ అధికారి వసీమొద్దీన్ కలిసి నక్కను బయటకు తీసి అటవీ ప్రాంతంలోకి సురక్షితంగా వదిలారు.



జన ఆవాసంలోకి వచ్చిన నక్క

# ఉద్యాన రైతుకు ఉత్తచేయి!

- ఏటా ఉమ్మడి జిల్లాలో 125 ఎకరాలకు ప్రతిపాదన
- ఈ సారి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో ఆగిన ప్లాంటేషన్
- అగమ్య గోచరంలో ఉమ్మడి జిల్లా రైతులు
- అదును దాటిపోతున్నదని ఆందోళన



సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రైతు తిరుపతి దంపతులు (ఫైల్)

..పక్క చిత్రంలో కనిపిస్తున్నది కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన మంద తిరుపతి. కొన్నేళ్లుగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి టమాటా, మిరప నారును రాయితీపై తెచ్చి సాగు చేస్తున్నడు. ఆధునిక సాంకేతిక పద్ధతి, నాణ్యమైన మట్టిలో 40 రోజులపాటు పెంచిన మొక్కలను తెచ్చుకొనే తిరుపతికి ఇప్పుడు ఆశలు లేకుండా పోయాయి. షెడ్‌నెట్ నీడలో మంచి వాతావరణంలో పెంచిన మొక్కలు నాటినట్టయితే ఎక్కువ శాతం బతికేవని, మంచి దిగుబడి కూడా వచ్చేదని ఆయన చెబుతున్నడు. ఈ సారి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఎలాంటి మొక్కలు పెంచడం లేదని, ప్రైవేట్ నర్సరీల్లో మొక్కలు కొనే దుస్థితి వచ్చిందని వాపోతున్నడు.

***రైతులపై చిన్నచూపు కనిపిస్తున్నది. రైతుబంధు వంటి వినూత్న పథకాన్ని పక్కన పెట్టిన ప్రస్తుత ప్రభుత్వం, కర్షకులకు ప్రయోజనం కలిగించే మరిన్ని కార్యక్రమాలను సైతం పట్టించుకోవడం లేదని తెలుస్తున్నది. అందుకు సిద్దిపేట జిల్లా ములుగు కేంద్రంగా ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఒక ఉదాహరణగా నిలుస్తున్నది. 2019 నుంచి ప్రతి సీజన్‌లో అక్కడ టమాటా, మిరప నారు పెంచి రైతులకు రాయితీపై ఇస్తుండగా.. ఈ సీజన్‌లో ప్లాంటేషన్ ఆగిపోయింది. దీంతో ఉద్యాన రైతుల్లో ఆందోళన కనిపిస్తున్నది.***

కరీంనగర్, జూలై 13 (నమస్తే తెలంగాణ) : ఉద్యాన రైతులు సాగు చేసే కూరగాయలు, పండ్ల తోటల్లో కీలకమైన మొక్కలను నర్సరీల్లో పెంచి ఇచ్చే లక్ష్యంతో బీఆర్ఎస్ సర్కారు 2019లో సిద్దిపేట జిల్లా ములుగు, హైదరాబాద్ సమీపంలోని జీడిమెట్లలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఫ్రూట్స్'ని ఏర్పాటు చేసింది. ములుగులో 2019 డిసెంబర్ 11న తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దీనిని ప్రారంభించారు. కరీంనగర్, మెదక్, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని ఉత్సాహవంతులైన ఉద్యాన రైతులకు ఇక్కడ టమాటా, మిరప నారు పెంచి అందిస్తున్నారు. ప్రతి సీజన్‌కు 40 రోజుల ముందే ఆయా జిల్లాల ఉద్యాన శాఖ అధికారులు రైతులను గుర్తించి, వారికి ఏ పంట నారు ఎంత అవసరమో..? సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధికారులకు నివేదిస్తారు. ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఒక ఎకరానికి సరిపడా నారు పెంచితే ₹8 వేల వరకు ఖర్చు వస్తున్నా.. రైతులకు మాత్రం రాయితీపై అందిస్తారు. ఎకరాకు సరిపడే మిరప నారుకు ₹1,280, టమాటా నారుకు ₹1,500 తీసుకుని అందిస్తారు. ఆధునిక సాంకేతిక పద్ధతిలో పెంచే ఈ నారు సాగు చేయడం వల్ల ఆశించిన దిగుబడి వస్తుండగా, ఏటేటా ఇక్కడి నారును తీసుకునే రైతులు పెరుగుతున్నారు.

### ఉమ్మడి జిల్లాలో 125 ఎకరాలు

ఉద్యాన పంటలకు నిలయంగా మారుతున్న ఉమ్మడి జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. రెండేళ్లుగా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ నుంచి తమకు కావాల్సిన నారు తెచ్చుకుంటున్నారు. ఈ వానకాలం సీజన్ చూస్తే.. కరీంనగర్‌లో 32.5, పెద్దపల్లిలో 35, సిరిసిల్లలో 32.5, జగిత్యాలలో 25 ఎకరాల చొప్పున మొత్తం 125 ఎకరాలకు ఆయా జిల్లాల ఉద్యాన శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అదే విధంగా మిగతా జిల్లాల నుంచి కూడా ప్రతిపాదనలు పంపించారు. రైతుల అవసరాలను బట్టి మే నెలాఖరులోనో.. జూన్ మొదటి వారంలోనో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధికారులు నారు పెంచే ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంటుంది. జూలై మొదటి, రెండో వారాల్లో రైతులు తెచ్చుకొని సాగు చేసుకునే అవకాశం ఉండేది. కానీ, ఇంత వరకు అక్కడి అధికారులు నారు పోసే ప్రక్రియను ప్రారంభించకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. టమాటా, మిరప నారు ఎందుకు పోయడం లేదని అడిగే ప్రయత్నం చేస్తే.. సరైన సమాధానం చెప్పే అధికారులు కూడా కరువయ్యారు.

### ప్రైవేట్ నర్సరీలవైపు..

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్లాంటేషన్ చేసి ఇస్తారను కొని రైతులు సొంతంగా నారు పోసుకోవాలనే ఆలోచన చేయలేదు. ముఖ్యంగా ఉద్యానశాఖ అధికారులు తమకు నారు పెంచి ఇస్తారనే నమ్మకంతో ఈ ప్రయత్నమే చేయలేదు. ఫలితంగా ఇప్పుడు పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారింది. సాగుకు అదును దాటుతుండడంతో ప్రైవేట్ నర్సరీలను ఆశ్రయించాల్సి వస్తున్నది. తీరా అక్కడికి వెళ్లి మొక్కలు కొనే ప్రయత్నం చేస్తే అడ్డగోలుగా ధర పెట్టాల్సి వస్తున్నదని రైతులు చెబుతున్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఎకరా టమాటా నారుకు ₹1,500, మిరప నారుకు ₹1,280 చెల్లిస్తే సరిపోయేదని, ఇప్పుడు ప్రైవేట్ నర్సరీ నుంచి తెచ్చుకోవాలంటే ఎకరా నారుకు ₹10 వేల నుంచి ₹12 వేలు ఖర్చు చేయాల్సి వస్తున్నదని వాపోతున్నారు. ఇంత పెద్ద మొత్తం లో ఖర్చు చేసే పరిస్థితి లేక ఎంతో మంది సాగు చేయకుండానే వదిలేస్తున్నారు. ఇప్పటికైనా కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్లాంటేషన్ చేపట్టాలని కోరుతున్నారు.




## జగిత్యాల నుంచి శంషాబాద్‌కు రాజధాని బస్సు

తెలంగాణచౌక్, జూలై 13 : జగిత్యాల డిపో నుంచి శంషాబాద్ వరకు రాజధాని బస్సు సర్వీసు నడుపుతున్నట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ సుచరిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 తేదీ నుంచి ప్రారంభ కానున్న రాజధాని సర్వీసు జగిత్యాల, కరీంనగర్‌మీదుగా ఉప్పల్ క్రాస్ రోడ్, ఎల్‌బీనగర్ మీదుగా శంషాబాద్‌కు చేరుకుంటుదన్నారు. ఉప్పల్ క్రాస్‌రోడ్, ఎల్‌బీ నగర్ ప్రయాణికులు ఈ బస్సు సర్వీసును వినియోగించుకోవాలని కోరారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కార్పొరేషన్, జూలై 13 : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు సరైన అవగాహన కల్పించడానికి ఆసక్తి ఉన్న యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగర ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. దోమల నివారణకు చేయాల్సిన కార్యక్రమాలు, డ్రై డే, ఫ్రై డే నిర్వహించేందుకు ఉత్సాహం ఉన్న వారి నుంచి తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. వీరు ఆయా ఇండ్ల యజమానులను కలిసి నీరు నిల్వ ఉంచుకోకుండా అవగాహన కల్పించడం, డ్రై డే కార్యక్రమాలు చేపట్టడం వంటివి చేయాలి. ఆసక్తి ఉన్న వారు, ఇతర వివరాలకు 9849907544లో సంప్రదించాలని, వాట్సప్ ద్వారా ఈనెల 18 లోగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

## మంచంపట్టిన మల్యాల

- విజృంభిస్తున్న విషజ్వరాలు



మల్యాల లో జ్వరంతో బాధపడుతున్న కుమారస్వామి, వేల్పుల కల్పన

కాల్వశ్రీరాంపూర్, జూలై 13 : మండలంలోని మల్యాలలో కొన్ని రోజులుగా విష జ్వరాలు ప్రబలి పలువురు మంచం పట్టారు. గ్రామంలో ఇంటికొకరు జ్వరంతో బాధపడుతున్నారు. జ్వరంతోపాటు ఒల్లంతా తీవ్ర నొప్పులతో ఇబ్బంది పడుతున్నారు. కనీసం లేచి నడవలేకపోతున్నారు. వైద్యం కోసం కొంత మంది కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ దవాఖానకు, మరి కొంతమంది ప్రైవేటు దవాఖానల చుట్టూ తిరుగుతున్నారు. అయినా నయం కాకపోవడంతో గ్రామంలో రోజు రోజుకూ జ్వర పీడితుల సంఖ్య పెరుగుతున్నదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో పారిశుధ్యం లోపమా, లేక మంచినీటి కలుషితమా అనేది అంతుపట్టడంలేదంటూ పలువురు పేర్కొన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# సుల్తానాబాద్ సంఘంలో ₹30లక్షలు గోల్‌మాల్!

- మూతపడ్డ చేనేత సహకార సంఘం
- చివరి అధ్యక్షుడు జనార్దన్ అక్రమాల ఫలితం
- కొంత మేర రికవరీ.. ఇంకా రాబట్టేందుకు ప్రయత్నం
- కార్మికులు తలోదారి, కుటుంబాలు ఆగం
- సొసైటీని పునరుద్ధరించాలని వేడుకోలు

**సుల్తానాబాద్ శ్రీ శ్రీనివాస చేనేత సహకార సంఘం అవినీతిలో కూరుకుపోయింది. ₹30 లక్షల నిధుల గోల్‌మాల్‌తో పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయింది. 175 మంది సభ్యులతో చేతినిండా పనితో ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన సొసైటీ చివరి వరకూ సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన తుమ్మ జనార్దన్ అక్రమాలతో మూతపడిపోయింది. ప్రభుత్వం నుంచి నూలు, రాయితీలు రాకుండా పోగా, కార్మికుల బతుకు ఆగమైంది. వృత్తిని వదిలేసి పనిలేక చెట్టుకొకరు పుట్టకొకరుగా వెళ్లిపోవాల్సిన పరిస్థితి దాపురించింది. సమగ్ర విచారణ అనంతరం తాజా మాజీ అధ్యక్షుడి నుంచి కొంత మేర రికవరీ చేసిన యంత్రాంగం, ఇంకా పెద్ద మొత్తంలో రాబట్టాల్సి ఉండగా, ఎవరో చేసిన తప్పునకు తమకు శిక్ష వేయొద్దని, ప్రభుత్వం స్పందించి మళ్లీ సంఘాన్ని పునరుద్ధరించాలని కార్మికులు కోరుతున్నారు.**

పెద్దపల్లి, జూలై 13 (నమస్తే తెలంగాణ): సుల్తానాబాద్‌లోని శ్రీ శ్రీనివాస చేనేత సహకార సంఘం 175 మంది సభ్యులతో సమైక్య రాష్ట్రంలోనే ఏర్పడింది. ఈ సంఘంలో సుల్తానాబాద్‌తోపాటు నారాయణ్‌పూర్, రేగడిమద్దికుంట, సుద్దాల, నిట్టూరు, అల్లీపూర్, గర్రెపల్లి, ఐతరాజ్‌పల్లి, రామునిపల్లి, తొగర్రాయి, కనుకుల, బొంతకుంటపల్లి, ఎలిగేడు మండలం లోకపేట, కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పలు గ్రామాల చేనేత కార్మికులు ఉపాధి పొందేవారు. ఆయా గ్రామాల్లో సంఘం ఆధ్వర్యంలో చేనేత యంత్రాలను ఏర్పాటు చేసి కార్మికుల నుంచి నేసిన బట్టలను ఆప్కోకు అందించేవారు. నిర్విరామంగా పనిదొరుకుతుండడంతో కార్మికులు మరమగ్గాలపై ఆధారపడి జీవించేవారు. క్రమంగా ఈ ప్రాంతం ఉపాధి కేంద్రంగా మారింది. ఆప్కో నుంచి వచ్చే నూలు ఇతర ముడిసరుకుల ద్వారా ఇక్కడ షర్ట్స్ క్లాత్, లుంగీ, టవల్స్, బెడ్‌షీట్స్, మ్యాటీస్, డ్రిల్స్‌ను నేసి తిరిగి సొసైటీద్వారా ఆప్కోకు అందించేవారు.



చేనేత సహకార సంఘంలోని చేనేత యంత్రాలు

### కంచే చేనుమేసింది?

ఈ సంఘంలో చివరి అధ్యక్షుడు, పాలకవర్గం హయాంలో ₹30 లక్షల వరకు అవినీతి జరిగిందని చేనేత శాఖకు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. అందులో అధ్యక్షుడే ప్రధాన సూత్రధారి అన్న ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. ప్రధానంగా 175 మంది సభ్యుల్లో 71 మంది సభ్యులను తనకు అనుకూలంగా లేరనే కారణంగా వారి సభ్యత్వాన్ని తుమ్మ జనార్దన్ తొలగించారని, సభ్యుల వాటాధనంలోని డబ్బును సభ్యులకు ఇవ్వకుండా చెల్లించినట్టుగా రికార్డుల్లో చూపారని ఆరోపణలు ఉన్నాయి. ఇంకా చేనేత సభ్యుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న త్రిఫ్ట్ డిపాజిట్ డబ్బు ₹2.50 లక్షలనూ ఫోర్జరీ సంతకాలతో కాజేశారని, చనిపోయిన ఇద్దరు కార్మికులకు ఎంజీబీబీవై పథకం కింద ఒక్కొక్కరికీ ₹20 వేల చొప్పున వచ్చిన ఇన్సూరెన్స్ డబ్బు కాజేశారని ఆరోపణలు ఉన్నాయి. వీటితోపాటు చేనేత భవనం మరమ్మతుల పేరిట ₹76 వేలు, కొత్త భవనం నిర్మాణం కోసమని చెప్పి భవనం కట్టకుండానే ₹2.56 లక్షలు సొంతానికి వాడుకున్నారని, కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన చేనేత యంత్రాల ద్వారా క్యాష్ క్రెడిట్‌గా ₹6 లక్షలు, ఐసీడీపీ సీసీ లోన్ ద్వారా ₹3 లక్షలు తీసుకున్నారని, రుణమాఫీ పథకం ద్వారా సంఘానికి ₹14 లక్షలు, రుణాల పేరిట ₹9 లక్షలు వచ్చినా సభ్యులకు సమాచారం ఇవ్వకుండా కాజేశారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా కేడీసీసీ బ్యాంకుకు సైతం సంఘం డ్యూ పడేలా చేశారు. ఒక దశలో సంఘం ఆస్తులను బ్యాంకు స్వాధీనం చేసుకునేందుకు ముందుకురాగా, కార్మికులు సమగ్ర వివరాలతో కలెక్టర్, చేనేత జౌళీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎప్పుడేం జరిగిందో వివరించారు. డబ్బుల డ్రా పూర్తిగా అధ్యక్షుడికే సంబంధించిన విషయమని స్పష్టం చేయడంతో విచారణ జరిపిన జౌళీ శాఖ అధికారులు అక్రమాలు జరిగినట్టు గుర్తించారు. అధ్యక్షుడిగా కొనసాగిన తుమ్మ జనార్దన్ నుంచి కొంత మేరకు రికవరీ చేయగా ఇంకా రికవరీ చేయాల్సి ఉన్నది.

### మూతపడ్డ సంఘం.. కార్మికులు వృత్తికి దూరం

సంఘానికి నాలుగు సొంత భవనాలున్నప్పటికీ సంఘంలో జరిగిన అవినీతి అక్రమాల వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే నూలు, రాయితీలు రాకుండా పోయాయి. క్రమంగా సంఘం మూతపడిపోగా, కార్మికుల జీవితాలు ఆగమయ్యాయి. దాదాపు 165 మంది వృత్తినే వదిలేశారు. ఇతర వృత్తులను ఎంచుకున్నారు. 10 మంది కార్మికులు మాత్రం కనుకులలోని శ్రీ వెంకటేశ్వర చేనేత సహకార సంఘం నుంచి నూలు తీసుకొని వారికి బట్ట నేచి ఇస్తూ ఉపాధి పొందుతున్నారు.

### సంఘాన్ని తిరిగి తెరిపిస్తాం

సుల్తానాబాద్‌లోని శ్రీ శ్రీనివాస చేనేత సహకార సంఘంలో జరిగిన అక్రమాలను గుర్తించాం. సంఘం అధ్యక్షుడి నుంచి ఇప్పటికే కొంత మేరకు రికవరీ చేశాం. ఇంకా రికవరీ చేయాల్సి ఉంది. చేస్తాం. సహకరించకపోతే రెవెన్యూ రికవరీ చట్టాన్ని ఉపయోగిస్తాం. బ్యాంకు బకాయికి సంబంధించి కొంత మేరకు చెల్లింపులు చేశాం. ఇంకా చెల్లించాల్సి ఉంది. అయితే, త్వరలోనే రుణమాఫీ వస్తుంది. అలా పూర్తిగా తేరిపోతుంది. అక్రమాలపై చర్యలు తీసుకొని తిరిగి సంఘాన్ని బలోపేతం చేస్తాం. త్వరలోనే ఎన్నికలను నిర్వహించి కొత్త కమిటీని ఎన్నుకుంటాం.

**- ఎస్ చరణ్, సహాయ సంచాలకుడు చేనేత, జౌళీ శాఖ (కరీంనగర్)**

# రోడ్డు కబ్జాకోరులను శిక్షించాలి

- దశాబ్దాలుగా పొలాలకు వెళ్లే రోడ్డునే ఆక్రమిస్తారా..?
- వెంటనే చర్యలు తీసుకోవాలని బిట్టుపల్లి రైతుల కన్నెర్ర
- మంథనిలో ధర్నా, రాస్తారోకో



అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

మంథని/మంథని రూరల్, జూలై 13: దశాబ్దాలుగా తమ పొలాల వద్దకు వెళ్లే చెరువుకట్ట, రహదారిని కబ్జా చేసిన వారిని శిక్షించాలని మంథని మండలం బిట్టుపల్లి రైతులు ఆందోళనకు దిగారు. రోడ్డును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం చెరువుకట్ట రహదారిని మళ్లీ పునరుద్ధరించే పనులను ప్రారంభించగా, కబ్జాదారులు వచ్చి అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. పోలీసులు వచ్చి ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించగా, రైతులంతా మంథనికి చేరుకొని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేశారు. అనంతరం గోడు వెల్లబోసుకున్నారు. బిట్టుపల్లి శివారులోని సర్వే నంబర్ 116లోని 217ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉందని, కాకర్లపల్లి, సూరయ్యపల్లి, ధర్మారం, సీతంపల్లి, బిట్టుపల్లి, ఎక్లాస్‌పూర్, నెల్లిపల్లి గ్రామాల్లోని వేలాది ఎకరాలకు ఈ చెరువు నీరే ఆధారమని చెప్పారు. ఈ చెరువు కట్టను ఆనుకొని ఉన్న రోడ్డుపై నుంచే రైతులు దశాబ్దాలుగా తమ పొలాలకు వెళ్తున్నామన్నారు. అయితే 30 మీటర్ల వెడల్పుతో సుమారు 200 మీటర్లకు పైగా పొడువు ఉన్న ఈ దారితోపాటు చెరువు కట్టను కొందరు తమ భూమిలో కలుపుకున్నారని ఆరోపించారు. ఈ కబ్జా భాగోతంపై గత సోమవారమే ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని, రెవెన్యూ అధికారులు కబ్జా స్థలం వద్దకు వెళ్లి పంచనామా నిర్వహించి పనులు నిలిపి వేయాలని ఆదేశించినా, కబ్జాదారులు పట్టించుకోలేదని చెప్పారు. అందుకే తామే వచ్చి పునర్నిర్మించే పనులు ప్రారంభించామని వివరించారు. అధికారులు వెంటనే స్పందించి చెరువు కట్ట, రహదారిని కబ్జా చేసిన వారిని వెంటనే శిక్షించాలని నినాదాలు చేశారు. పోలీసులు వచ్చి ధర్నా విరమింపజేసే ప్రయత్నం చేసినప్పటికీ సఫలం కాలేదు. మంథని తహసీల్దార్ రాజయ్య రైతులతో ఫోన్లో మాట్లాడారు. సోమవారం వరకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో శాంతించారు.



చెత్తను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

# బయో వ్యర్థాలపై బల్దియా ఫోకస్

- కరీంనగర్‌లోని అన్ని దవాఖానల్లో తనిఖీలు
- భారీగా జరిమానాల విధింపు
- సాధారణ చెత్తలో కలిపితే కఠిన చర్యలు
- ఇన్‌చార్జి కమిషనర్ హెచ్చరిక

కరీంనగర్ కార్పొరేషన్, జూలై 13 : కరీంనగర్‌లోని పలు దవాఖానల బయో వ్యర్థాలపై నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టిపెట్టింది. బల్దియాకు అందిస్తున్న చెత్తలోనే వాటిని కూడా కలుపుతుండడంతో ఇన్‌చార్జి కమిషనర్ కఠిన చర్యలు మొదలు పెట్టారు. వారం రోజులుగా నగరంలోని అన్ని దవాఖానల్లో పారిశుధ్య అధికారులు తనిఖీలు చేస్తున్నారు. నిబంధనలు పాటించని పలు దవాఖానలకు నోటీసులు అందించడం.. అప్పటికీ తీరు మారకపోతే భారీ జరిమానాలు సైతం విధిస్తున్నారు. ఇప్పటికే 38 దవాఖానలకు సుమారు ₹4 లక్షల మేర జరిమానా విధించినట్టు పారిశుధ్య విభాగం అధికారులు తెలిపారు. అందులో భాగంగా శనివారం దవాఖానలపై జరుగుతున్న తనిఖీలను ఇన్‌చార్జి కమిషనర్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించారు. పలు దవాఖానల నుంచి మున్సిపాలిటీకి అందిస్తున్న చెత్తను పరిశీలించగా, అందులో బయో వ్యర్థాలు ఉన్నట్టు గుర్తించి మూడు దవాఖానలకు భారీ స్థాయిలో జరిమానాలు విధించారు. భూంరెడ్డి, కేసీ డయాగ్నోస్టిక్ సెంటర్లకు ₹లక్ష చొప్పున, గంగా దవాఖానకు ₹50 వేల జరిమానా విధించారు.

### నిబంధనలు పాటించాలి : ఇన్‌చార్జి కమిషనర్

నగరంలోని దవాఖానల యాజమాన్యాలు బయో వ్యర్థాలను నిబంధనల మేరకు నిర్వీర్యం చేయాలని, చెత్త వాహనాల్లో వేయద్దని ఇన్‌చార్జి కమిషనర్ ఆదేశించారు. ఇప్పటికే పలు దవాఖానలకు నోటీసులు జారీ చేశామని, రెండోసారి పట్టుబడితే జరిమానాలు విధిస్తామని, మూడోసారి రూ.లక్షకు పైగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అప్పటికి కూడా తీరు మారకపోతే రిజిస్ట్రేషన్ల రద్దుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాంనగర్, బుట్టిరాజారాం కాలనీలో డెంగీ కేసులు నమోదు కాగా, ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్త పేరుకపోకుండా, నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలని, ఖాళీ స్థలాల్లో నీరు, చెత్త నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. నీరు నిల్వఉన్న ప్రాంతాల్లో అయిల్ బాల్స్, గంబూషియా చేపలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమాల్లో పారిశుధ్య అధికారులు స్వామి, గట్టు శ్రీనివాస్, నరోత్తం, కుమారస్వామి పాల్గొన్నారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571